

10 నుంచి టెట్ పరీక్షలు : డిఎస్ఇఒ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పాఠశాల విద్య సంచాలకుల ఉత్తర్వుల మేరకు జిల్లాలో టెట్ పరీక్షలు ఈ నెల 10వ తేదీ నుంచి 21వ తేదీ వరకూ జరుగుతాయని డిఎస్ఇఒ కంది వాసుదేవరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాజమహేంద్రవరంలోని లూథరగిరి వద్ద రాజీవ్ గాంధీ గ్రూప్ అఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఇన్స్టిట్యూట్‌లోనిఇయాన్ డిజిటల్ జోన్‌లో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. సెషన్ -1 ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,. సెషన్ -2 మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జరుగుతాయన్నారు. అభ్యర్థులందరూ హాల్ టికెట్ వెనుక ఇచ్చిన సూచనలను తప్పక పాటించాలన్నారు. ఈ పరీక్ష కోసం ఇప్పటికే డిపార్ట్‌మెంట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

రబీకి సన్నద్ధం

- 1.53 లక్షల ఎకరాల్లో వరి సాగు
- ప్రణాళికలను సిద్ధం చేసిన అధికారులు
- ఇప్పటికే 537 ఎకరాల్లో వరి నారుమళ్లు

ప్రజాశక్తి - కొవ్వూరు

ఖరీఫ్‌లో జిల్లా రైతులు మొంథా తుపాను ప్రభావంతో కష్టాలను చవిచూశారు. కోటి ఆశలతో రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ కోతలు కొలిక్కి వస్తుండడంతో నారుమళ్లకు భూములను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ముందస్తుగా కోతలు పూర్తి చేసుకున్న రైతులు వరి నారుమళ్లను పోశారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో 1,53,215 ఎకరాల్లో వరి సాగవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇందు కోసం 7,665 ఎకరాల్లో నారుమళ్ల వేయాల్సి ఉంది.ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 537.5 ఎకరాల్లో ముందస్తుగా నారుమళ్లను వేశారు.

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ వరి కోతలు ఇప్పటికే 99.2 శాతం పూర్తయ్యాయి. గోకవరం, కోరుకొండ, తాళ్లపూడి మండలాల్లో కొంత మేరకు కోతలు పూర్తి కావాల్సి ఉంది. జిల్లాలో 1,51,455 ఎకరాల ఆయకట్టులో 60 శాతం బోర్ల కింద సాగు అవుతుండగా 18 శాతం గోదావరి డెల్టా ఆయకట్టు పరిధిలోను, 11శాతం చెరువుల కింద సాగు అవుతుంది. 22,543 ఎకరాలు మాత్రం వర్షాధారంపై ఆధార పడి సాగు చేస్తున్నారు.

ఉత్తిపోతల పథకాలు:

జిల్లా వ్యాప్తంగా మెట్ట ప్రాంతం అధికంగా ఉంది. అక్కడ పంటల సాగు కోసం గోదావరి నది తీరంలో 15 ఎత్తిపోతల పథకాలున్నా యి. ఈ పథకాలు అవసాన దశకు చేరుకోవడంతో మోటార్లు, పంపులు సక్రమంగా పనిచేయట్లేదు. కొన్నిచోట్ల పైప్ లైన్ల లీకులు, కాలువలు సక్రమంగా లేకపోవడంతో 30 శాతం ఆయకట్టు కూడా నీరందని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 29 ఎత్తిపోతల పథకాలు ఉంటే ఐదు మాత్రమే పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయి. కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐదు ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.30.01 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. జులై 1న తాళ్లపూడి మండలం మలకపల్లికి వచ్చిన సిఎం చంద్రబాబుకు స్థానిక ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వ రరావు ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ చేయాలని విన్నవించారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఐదు నెలలు పూర్తి అయినా నేటికీ నిధులు మంజూరు కాలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు అధికారులు రూ.91.32 కోట్ల మేర ప్రతిపాదన పంపించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఒక రూపాయి కూడా విడుదల కాలేదు. అనపర్తిలో కాపవరం ఎత్తిపోతల పథకం 69 ఎకరాలకు నీరందించాల్సి ఉంది, ఇక్కడ రెండు మోటర్లు రిపేర్‌లో ఉన్నాయి. పైప్ లైన్ లీకులు కూడా ఉన్నాయి. కుమారదేవం ఎత్తిపోతల పథకం ద్వారా 4,950 ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉండగా 1,900 ఎకరాలకు మాత్రమే అందుతుంది. వేగేశ్వరపురం, పైడిమెట్ట, బ్రాహ్మణగూడెం, చాగల్లు ఎత్తిపోతల పథకాలదీ ఇదే పరిస్థితి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న తాడిపూడి ఎత్తిపోతల పథకం కింద ఉన్న అనేక కాలువలకు నేటికీ సాగునీరు అందాని పరిస్థితి. తాడిపూడిపై ఐదో లిఫ్ట్ ప్రారంభానికి నోచుకోక పోవడంతో దేవరపల్లి మండలంలో 5వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. తోట వెంకటాచలం, తొర్రేడు, పుష్కర ఎత్తిపోతల పథకాల ఆయకట్టు రైతలదీ ఇదే పరిస్థితి.

కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం

జిల్లా వ్యాప్తంగా అత్యధిక శాతం మంది కౌలు రైతులే సాగు చేస్తున్నారు. జిల్లాలో 1.10 లక్షల మంది కౌలు రైతులున్నారు. కూటమి ప్రభుత్వం 63.60 శాతం మందికి మాత్రమే సిసిఆర్‌సి కార్డులు అందించింది. 69,955 మందికి పంపిణీ చేయగా ఇంకా 40,045 రైతులకు కార్డులు అందలేదు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు నాలుగు పంట కాలాలు పూర్తయ్యాయి. రైతులకు రు.7వేల చొప్పున రెండుసార్లు మాత్రమే అందించింది.

అందుబాటులో ఎరువులు

జిల్లాలో రబీ సీజన్‌కి అన్ని రకాల ఎరువులు కలిపి 1,10,353 మెట్రిక్ టన్నులు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 18,910 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా 53,522 మెట్రిక్ టన్నులకు 4,791, డిఎపి 8564కి 2,252, ఎంఒపి 5,814కి 1,997, ఎంపికె 34,307 మెట్రిక్ టన్నులకు 7,642, ఎస్ఎస్ పి 8,146 మెట్రిక్ టన్నులకు 2,228 మెట్రిక్ టన్ను అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏ పంట ఎంత విస్తీర్ణం

జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో 1,96,480 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో 9,220 ఎకరాల్లో ఇప్పటి వరకు పంటలు వేశారు. ప్రధానంగా వరి 1,53,315 ఎకరాల్లో సాగు చేస్తుండగా మొక్కజొన్న 21,615 ఎకరాల్లో సాగవుతుంది. ఇప్పటికే జిల్లాలో 3,510 ఎకరాల్లో పంట వేశారు. సెనగలు 2,015 ఎకరాలకు 625 ఎకరాల్లో, నాటు పొగాకు 13,860 ఎకరాలకు 4,945 ఎకరాల్లో ఇప్పటికే పంట వేశారు. మినుము పంట 1,927.5 ఎకరాలకు 35 ఎకరాల్లో పంట వేశారు. పెసర 1,085 ఎకరాలు, వేరుశనగ 602.5 ఎకరాలు, నువ్వులు 560 ఎకరాలు, సన్‌ఫ్లవర్ 467.5 ఎకరాలు, చెరకు 105 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు.



కొవ్వూరు మండలం మద్దూరులో సిద్ధం చేసిన నారుమడి

రబీ సాగుకు ప్రణాళికల సిద్ధం

రబీ సాగులో రైతులకు అవసరమైన తెలుగులో సిద్ధంగా ఉన్నాయి. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను రూపొందించాం. సిసిఆర్‌సి కార్డులు పంపిణీ త్వరితన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రబీ సీజన్లో విత్తనాలు రైతు నుంచి రైతు తీసుకుంటారు విత్తనాలకు కొరత ఉండదు. రైతు సేవా కేంద్రాల ద్వారా అవసరమైన సహకారం అందిస్తున్నాం.

-ఎస్ మాధవరావు జిల్లా వ్యవసాయ అధికారి



ధరణీ పుత్రులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

మాతృభాష తర్వాతే సోదర భాష

మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - రాజానగరం

మాతృభాష నేర్చుకున్న తర్వాతే సోదర భాషలైన హిందీ, తమిళం, మలయాళం వంటి భాషలు నేర్చుకోవాలని అనంతరమే పరభాషల జోలికి పోవాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ఎన్‌టిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడు పాల్గొన్ని విసి ప్రసన్నశ్రీతో కలిపి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. అనంతరం సైకాలజిస్ట్ రిటైర్డ్ డిఎస్‌పి డాక్టర్ నామగిరి బాబ్జీ రచించిన 'హ్యాండ్ బుక్ ఆఫ్ డ్రగ్ ఎడిక్షన్ అండ్ ది రోల్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్' పుస్తకం, సోషల్ వర్క్ విభాగానికి చెందిన డాక్టర్ మల్లిభాస్కర్ రచించిన మస్తాన్ బాబు జీవన చిత్రం 'శిఖరాగ్రి మల్లి' పుస్తకం, నర్సరీ రైతు పుల్లా చిన సత్యనారాయణ రచించిన 'ధరణి పుత్రులు' పుస్త కాన్ని ఆయన ఆవిష్కరించారు. విసి ఎస్.ప్రసన్నశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో వెంకయ్య నాయుడు మాట్లాడారు. ప్రధాని మోడీ మాతృభాష గుజరాతీలో, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాతృభాష ఒరియాలో, సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్‌వి.రమణ మాతృభాష తెలుగులో చదువున్నారన్నారు. తాను కూడా మాతృభాషలోనే చదివి ఉపరాష్ట్రపతిని అయ్యానన్నారు. అన్ని ప్రభుత్వ దస్త్రాలు తెలుగులోనే ఉండాలన్నారు. విసి ప్రసన్నశ్రీ మాట్లాడుతూ భాష నిత్య ప్రవాహిని అన్నారు. ఒక జీవనదిలా కాలానుగుణంగా అవసరా లకు తగినట్లుగా మారుతూ ముందుకు సాగుతుంద న్నారు. ఒక భాష ఆయా కాలాల్లో ఆ సమాజంలో అప్పటి సంస్కృతి, సంప్రదాయాల్ని, జీవన విధా నాల్ని, భావజాలాలని ప్రతి ఫలింపజేస్తుందన్నారు. అనతంరం మాజీ ఉప రాష్ట్రపతిని సన్మా నించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు, సంస్కృత అకాడెమీ అధ్యక్షులు ఆర్‌డి. విల్సన్, తానా పూర్వాధ్యక్షుడు డాక్టర్ తోటకూర ప్రసాద్, భారతీయ భాషా సమితి అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.గిరి ధరరావు, డాక్టర్ కెవిఎన్‌డి.వరప్రసాద్, జాతీయ సదస్సు కో-ఆర్డినే టర్ డాక్టర్. తలారి వాసు, నర్సరీ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పుల్లా ఆంజనే యులు, ఐఎన్ఎ మాజీ ఉపాధ్యక్షులు పుల్లా వీరవెంక ట్రావు, పుల్లా సోదరులు పెద్ద సత్యనారాయణ, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లపూడి మండల సమావేశం

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30కు ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఎంపిపి జొన్నకూటి పోసిరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులతో పాటు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

కొత్తపల్లిలో ఉపాధి గ్రామ సభ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ గ్రామ సభను పరిశీలకులు మండల విద్యాశాఖ అధికారి-2 షేక్‌సూర్జహాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. 2024-25లో నిర్వహించిన ఉపాధి పనుల నిమిత్తం గ్రామంలో సామాజిక తనిఖీ నిర్వహించారు ఈ తనిఖీలో 12 పంట బోదులు, 1 సిసి డ్రెయిన్, 2 సిసి రోడ్ల పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బండారు వెంకటరమణసాయిబాబా, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు అబ్బిశెట్టి సత్తిరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు బర్రె దొరస్వామి, తెలుగు యువత మండల అధ్యక్షులు బండారు బాబి, ఫీల్డ్ అసిస్టెంట్ ఏలూరు శ్రీను, కార్యదర్శి భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు

రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లకు సోమవారం కౌన్సలింగ్ నిర్వహించారు. చట్ట పరిధి దాటి సమాజంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఊరుకోబోమని హెచ్చరించారు. సమాజంలో ఎలా నడుచుకోవాలో సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహాకిశోర్ మాట్లాడుతూ ఇప్పటి నుంచైనా మంచిగా ప్రవర్తించాలని, ఎటువంటి వివాదాల్లో జోక్యం చేసుకోవాదని సూచించారు. ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చట్ట పరిధి దాటిన వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి, సారా వంటి వాటిని సేవించరాదన్నారు.

సమస్యలపై సహకార ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - గోపాలపురం

సహకార సంఘ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, జిఒ 36ను వెంటనే అమలు చేయాలని గోపాలపురం, చిట్యాల సహకార సంఘ ఉద్యోగులు కోరారు.. సోమవారం స్థానిక సహకార బ్యాంకు వద్ద వారు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలపురం, చిట్యాల సొసైటీ సెక్రటరీలు బి.శ్రీనివాస్, హర్షవర్ధన్ మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలు అందించడంలో సహకార సంఘాలు ఎంతగానో కృషి చేస్తున్నాయన్నారు. అయినా సిబ్బందిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకు వేతన సవరణలు చేయాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. గ్రాడ్యుటీ చట్టాన్ని అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం చెరుకుమిల్లి సహకార సంఘాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సహకార సంఘ ఉద్యోగులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తాళ్లపూడి డిసిసిబిని కార్యాలయాన్ని మూసివేసి బ్రాంచ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బొర్రా రామచంద్రం మాట్లాడుతూ జిఒ 36ను వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు.ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలన్నారు. ప్రతీ ఐదేళ్లకు వేతన సవరణ చేయడంతో పాటు పెండింగులో ఉన్న వేతన సవరణలకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తా మన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో తాళ్లపూడి, పోలవరం మండలాలకు చెందిన వివిధ సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నిడదవోలు : ఎపి సహకార ఉద్యోగుల సంఘం జెఎసి పిలుపు మేరకు నిడదవోలు డిసిసిబి బ్రాంచ్ వద్ద సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను సంఘం గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు ప్రారంభించారు. పర్యాటక శాఖ మంత్రి మంత్రి కందుల దుర్గేష్ ఈ శిబిరం వద్ద ఆగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న జరిగే కేబినెట్‌లో ఈ సమస్యలను ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎన్.మూర్తి. కె.శ్రీనివాస్, కేతనపల్లి శ్రీనివాస్, డి.సూర్యచంద్రరావు, పెండ్యాల వరలక్ష్మి, పి.ప్రకాశరావు, కె.సుబ్బారావు, పి.సురేంద్ర బాబు, ఎ.శ్రీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో నిరసన తెలుపుతున్న సహకార ఉద్యోగులు



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. ప్రధాన కార్యదర్శిగా ఎం.కోదండరామ్, అధ్యక్షులుగా ఎస్‌ఆర్‌జె.మాథ్యూస్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సిహెచ్.సత్యదేవ, ఐవి.సుధాకర్, జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.కోదండరామ్, జాయింట్ సెక్రటరీలుగా పిఎస్ఎన్.రాజు, ఎ.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, కోశాధికారిగా వి.ఈశ్వరరావులతో పాటు ఎనిమిది మందిని ఇసి మెంబర్లుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కోదండరామ్ మాట్లాడారు. జీవిత బీమా ప్రీమియం, ఆరోగ్య బీమా ప్రీమియంపై భారంగా ఉన్న జిఎస్‌టిని రద్దు చేయించడంలో యూనియన్ కీలక భూమిక పోషించిందన్నారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు, 400 మంది ఎంపీ లను కలిసి విజ్ఞాపన పత్రం ఇవ్వడం ద్వారా పార్లమెంట్‌లో ఈ అంశం చర్చకు వచ్చిందన్నారు. తద్వారా జిఎస్‌టి రద్దు అయ్యిందన్నారు. యూనియన్ ప్లాటినమ్ జూబ్లీ ఆలిండియా మహాసభ ఈ నెలాఖరులో భువనేశ్వర్‌లో జరుగుతుందన్నారు. ఈ సభలో ఎల్‌ఐసిలో ఖాళీ పోస్టుల భర్తీ, క్లాస్ 3, 4 ఉద్యోగాల నియామకాలు, ఎల్‌ఐసి పరిరక్షణ వంటి వాటిపై చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతినిధులకు, సమావేశాన్ని సజావుగా నడిపించిన జోనల్ ఫెడరేషన్ నాయకులు రవీంద్రనాథ్, సతీష్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో వికలాంగులకు పాట్లు

ప్రజాశక్తి- గోపాలపురం

అధికారుల నిర్లక్ష్యం కారణంగా సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన వికలాంగులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం గోపాలపురం సిహెచ్‌సి వద్దకు సుమారు 40 మందికి పైగా సదరం సర్టిపికెట్ కసం వికలాంగులు వాహనాలు పట్టుకుని సహాయకులతో వచ్చారు. తీరా వచ్చిన తరువాత వారికి చేదు అనుభవం ఎదురైంది. ఇక్కడ సదరం వెరిఫికేషన్ సెంటర్ లేదని ఎటువంటి సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం లేదని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. సదరం వెరిఫికేషన్ చేయకపోతే ఆన్‌లైన్‌లో గోపాలపురం సిహెచ్‌సి పేరు ఎందుకు ఇచ్చారని సిబ్బందిని, వైద్య అధికారులను నిలదీశారు. రీ వెరిఫికేషన్ పేరుతో సుమారు 7 నెలల వరకు సదరం సర్టిఫికెట్లు జారీ చేయడం నిలిపేశారని వారు తెలిపారు. సదరం సర్టిఫికెట్ లేకపోవడంతో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోలేదని తెఉలిపారు. స్లాట్ బుక్ చేసుకునేందుకు అనేకసార్లు సచివాలయంకు వెళ్లి వెనుదిరిగామన్నారు. సెప్టెంబర్ నుంచి స్లాట్ బుకింగ్ ఇవ్వడంతో ఎంతో ఆశతో బుక్ చేసుకున్నామని తెలిపారు. ఎంతో ప్రయాసపడి వస్తే సదరం సెంటర్ లేదంటున్నారని కంట తడి పెట్టుకున్నారు. ఇక్కడ డాక్టర్‌ను ఏర్పాటు చేసి తమకు న్యాయం చేయాలని తెలిపారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్య రాజును వివరణ కోరగా... జనవరికి ముందు ఇక్కడ సదరం వెరిఫికేషన్ సెంటర్ ఉండేదన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి సదరం వెరిఫికేషన్ నిలుపుదల చేశారని తెలిపారు. 50 బెడ్లు నుంచి వంద బెడ్లు కలిగి ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే సదరం సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొవ్వూరు, అనపర్తి, రాజమండ్రిలో మాత్రమే ఉన్నాయన్నారు. కొవ్వూరు డిసిహెచ్ఒకు ఈ విషయాన్ని తెలియజేసినా ఆన్‌లైన్‌లో గోపాలపురం పేరు తొలగించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు.



ఆసుత్రికి వచ్చిన వికలాంగులు


డిప్యూటీ ఎంపిడిఒగా సత్యనారాయణ

ప్రజాశక్తి- గోపాలపురం



గోపాలపురం మండలం జిఎస్‌డబ్ల్యుఎస్ డిప్యూటీ ఎంపిడిఒగా ఆర్‌వి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గతంలో తాళ్లపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశానన్నారు. ఉద్యోగోన్నతిపై గోపాలపురం వచ్చానన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానన్నారు. సచివాలయాల సేవలను ప్రజలకు త్వరగా అందేలా చూస్తానన్నారు.

కార్టూ'నిజం'



ఉపాధ్యాయునికి అండగా నిలిచిన కొండవీటి విద్యాసంస్థ

ప్రజాశక్తి -గోపాలపురం

ప్రాణాపాస్థితిలో ఉన్న ఉపాధ్యాయునికి కొండవీటి విద్యాసంస్థ అండగా నిలిచింది. తమ వంతు సహాయంగా రూ.50వేలు అందించామని కొండవీటి విద్యాసంస్థ సెక్రటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం సోమవారం తెలిపారు. మండలంలోని వేలచింతలగూడెం గ్రామానికి చెందిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు గ్రహీత కొయ్య శ్రీనివాసరావు గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు గుండె మార్పిడి నిమిత్తం సుమారు రూ.45 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. శ్రీనివాసరావుకు వైద్యం చేయించేందుకు అంత సొమ్ము లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కొండవీటి విద్యాసంస్థ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు విరాళాలు సేకరించి అందించారు. కళాశాల తరపున శ్రీనివాసరావు సతీమణి కొయ్య సుమన్ విద్య బ్యాంకు ఖాతాకు ఈ నగదును జమేశామని తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు టిడిపి కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు లబ్ధిదారులకు సోమవారం అందించారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం, తిరుగుడు మెట్ట, అన్నదేవరపేట, తాళ్లపూడి, చాగల్లు మండలం ఊనగట్ల, దార వరం, చాగల్లు, మార్కొండపాడు, చంద్రవరం గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.6,01,327 విలువైన చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో టుమెన్ కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, ఆర్.రామకృష్ణ, ఆళ్ల హరిబాబు, సూరపని చిన్ని, సూర్యదేవర రంజిత్, బొడ్డు కేశవ్, కూచిపూడి గణపతి, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను చూపుతున్న లబ్ధిదారులు

9 నుంచి స్పార్క్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఈ నెల 9 నుంచి 11వరకూ 'స్పార్క్' పేరిట స్టార్టప్ ఐడియాలు ఉన్న ఔత్సాహిక వ్యాపారవేత్తల కోసం మూడు రోజుల ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను కీర్తి చేకూరి సోమవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రారంభ దశ ఫౌండర్లు, ఇన్నోవేటర్లు, విద్యార్థులు, స్టార్టప్‌లపై ఆసక్తి ఉన్నవారిని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌టిఐహెచ్ డైరెక్టర్, జెసి వై.మేఘస్వరూప్ మాట్లాడుతూ ఖాడు రోజుల ప్రోగ్రామ్‌లో మొదటి రోజు బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో, రెండవ రోజు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల, మూడవ రోజు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహిస్తామన్నారు. ఆర్టిఐహెచ్ హబ్ నోడల్ ఆఫీసర్ టి.వి. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనతో ఉన్న అంకుర సంస్థల ఉనికి, సామర్థ్యం గల బిజినెస్ కాన్సెప్ట్‌గా అభివృద్ధి చేసుకోవడానికి ఈ ప్రోగ్రామ్ చక్కటి అవకాశమన్నారు. ఈ కార్యక్రమంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానానికి సంపంగి మొక్కల అందజేత

ప్రజాశక్తి-కడియం

సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి అవసరమైన సంపంగి చెట్లను మండలంలోని కడియపులంక దుర్గా నర్సరీ రైతు పెద్దిరెడ్డి శ్రీనివాసు సోమవారం విరాళంగా అందజేశారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ హరికృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం కూడా సంపంగి చెట్లను పంపించారన్నారు. ఖరీదైన ఈ చెట్లు అందజేసిన శ్రీనివాసును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రైతులు గంగుల సత్యనారాయణ, గెడ్డం ఆదినారాయణ, పెద్దిరెడ్డి శ్రీనివాసు, చల్లా దుర్గారావు,బాదం పెద్దకాపు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎస్‌టియు తాళ్లపూడి మండల అధ్యక్షునిగా యు.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ శాఖ పూర్వపు అధ్యక్షురాలు జెడి.సునీత అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు డేనియల్ బాబు హాజరయ్యారు. అధ్యక్షునితోపాటు ప్రధాన కార్యదర్శిగా బుచ్చిబాబు, ఆర్థిక కార్యదర్శిగా సత్యనారాయణ, అసోసియేటెడ్ అధ్యక్షునిగా రఘురామ్, మహిళా కార్యదర్శులుగా కాత్యాయని ఎన్నికయ్యారు.

నేరాలు ఘోరాలు

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన గంగుల మధు(27) ఈనెల 6వ తేదీ నుంచి అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఆరోతేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఇంటి నుంచి బైకుపై వెళ్లిన ఆయన తిరిగి ఇంటిరి రాలేదు. అతని కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె తల్లి గంగుల వరలక్ష్మి పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796662, 9154875597 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

రెండిళ్లలో చోరీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాపవరం గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో రూ.10 వేలు నగదు, ఎనిమిది రూపులతో లక్ష్మీదేవి నల్లపూసల దండ, పది తులాల వెండి పట్టీలు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వారి ఇంటి పక్కన ఉన్న నరాల సత్యనారాయణ ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం. లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి, సిఐ

హత్య కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో కాకర అప్పారావు హత్య కేసులో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. నవంబర్ 5న భూపాలపట్నంలో అప్పారావును కుళ్ళ రాజిబాబు, నాగేశ్వరరావు హత్య చేసి పరారీలో న్నారన్నారు. రాజిబాబును జగ్గంపేట మండలం రామవరం వద్ద సోమవారం అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. అప్పారావుపై ఉన్న కక్షతో తన తమ్ముడు నాగేశ్వరరావుతో కలిసి ఇనుప రాడ్లతో కొట్టి చంపినట్లు రాజిబాబు ఒప్పుకున్నాడని తెలిపారు. పరారీలో ఉన్న నాగేశ్వరరావు కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఉన్నారు.



రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న కంకర

బైకు జారితే ప్రాణాలకే ప్రమాదం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు లంపకలోవ గ్రామానికి వెళ్లే చెరువుగట్టు రహదారిపై గృహ నిర్మాణానికి చేపట్టే కంకర గుట్టలు రహదారికి అడ్డంగా దర్శనమిస్తున్నాయి. ఈ కంకర గుట్టలు రహదారిపై చిప్స్ రూపంలో ఉండడంతో కనీసం వాహనదారులు కూడా వెళ్లడానికి వీలు లేకుండా ఉంది. రహదారిపై అడ్డంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కంకరపై బైకులు స్కిడ్ అవుతే రోడ్డు పక్కన చెరువులోకి వెళ్లి పడే ప్రమాదం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువు గట్టు రహదారిపై సుమారు 14 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తున్నారు. ఈ రహదారిపై ఆటో వెళ్లాలన్న, కారు వెళ్లాలన్న దారి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రహదారిపై ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అందరి బాధ్యత అని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం 'ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు నగరపాలక సంస్థ పలు కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈసారి వినూత్న రీతిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 'ప్లాస్టిక్ రీసైక్లింగ్ లీగ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18, 19 తేదీల్లో పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి ప్లాస్టిక్ డబ్బాలు, బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తామన్నారు. అత్యధికంగా వ్యర్థాలను సేకరించిన టాప్-3 పాఠశాలలకు మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవార్డులు అందిస్తామన్నారు. బాల్యం నుంచే ప్లాస్టిక్‌ను దూరం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించొచ్చన్నారు. నగరపాలక సంస్థ మరియు శక్తి ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ సంయుక్తంగా నిర్వహించే ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాల కోసం 9494060060 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, ఇఇలు మదర్సా అలీ, మాధవి, పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు వెళ్ళే బంధులదొడ్డి దారిలోని వ్యర్థాలను తొలగించి, అక్కడ చెత్త వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు జి.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి జివివిఎస్.ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

మత్స్యకారుల జీవనోపాధికి శిక్షణ

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

మత్స్యకారుల జీవనోపాధిపై ఇతర రాష్ట్రాలకు శిక్షణ కోసం వెళుతున్న 60 మంది మత్స్యకారుల బస్సులను సోమవారం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి ప్రారంభించారు. దొరబాబు మాట్లాడుతూ మత్స్యకారులు మూడు రోజులపాటు శిక్షణ కోసం కేరళ, తమిళనాడు వెళుతున్నారని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తమిళనాడులో రెండు బృందాలుగా మండపం చేరుకుంటుందని, అక్కడ ఉన్న సముద్రంలో నాచు పెంపకం, పగడపు దిబ్బలపై వివరిస్తారని తెలిపారు.

బిసిల సమైక్యతే బిసివై పార్టీ లక్ష్యం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

రాష్ట్రంలో బిసిలను ఒక తాటిపైకి తీసుకొచ్చి రాజ్యాధికార దిశగా ముందుకు పోవడమే బిసివై పార్టీ లక్ష్యం అని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ గొంప శివకుమార్ యాదవ్ అన్నారు. ఈ నెల 11న విజయవాడలో నిర్వహించే బిసిల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బిసివై అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుండి బిసి నాయకులు హాజరవుతారన్నారు.

రబీ నీటి లభ్యతపై మురాలశెట్టి ఆరా

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

రబీ ఆకుమడులకు నీటి లభ్యతపై సోమవారం తూర్పు డెల్టా ఛైర్మన్ మురాల శెట్టి సునీల్ కుమార్ మండలంలో పలు రైతులను కలిశారు. చిత్రాడ, ఎండపల్లిలో ఆకుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులను కలిసి నీటి లభ్యత గురించి ఆరా తీశారు. వంతులవారీ నీటి వినియోగంలో పలు సూచనలు అందిచారు. నీటి సరఫరా పెంచాలని మదపురం, కొత్తపల్లి, కొమరగిరి గ్రామల రైతులు కోరారు. నీటి ఎద్దడి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సునీల్ కుమార్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బసవ సత్తిబాబు, పెంకే జగదీష్, దేసినీడి సతీష్, గుండ్ర జగ్గారావు, మత్సాశ్రీనివాసరావు, గుండ్ర కిశోర్, గుండ్ర బాబ్జి, రైతులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి -తాళ్లరేవు

ఇతర జిల్లాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ ఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనీష్ అన్నారు. సోమవారంకోరంగి పోలీస్ స్టేషన్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్లో గతం కంటే క్రైమ్ రేటు తగ్గిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 255 కేసులకుగాను 120కి తగ్గించినట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు, క్రైమ్ రేటు తగ్గించడానికి కోరంగి ఎస్ఐ సత్యనారాయణ తీసుకున్న చర్యలను ఆయన అభినందించారు. సిఐ చైతన్య కృష్ణ పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సమస్యలు సృష్టించినా, లేదా ప్రేరేపించినా అట్టి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. సోమవారం తెల్లవారుజామున జిల్లాలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహకిశోర్ మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామన్నారు. అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీశామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినతులపై దృష్టి సారించాలి : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందించే వినతులపై దృష్టి సారించాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 23 అర్జీలు వచ్చాయి. వీటిలో ఇంజినీరింగ్‌కి సంబంధించి 7, రెవెన్యూకి సంబంధించి 2, టౌన్ ప్లానింగ్‌కి సంబంధించి 5, పబ్లిక్ హెల్త్‌కి సంబంధించి 4, మెప్మాకు సంబంధించి 3, వార్డు సచివాలయాలకు సంబంధించి ఒకటి, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఒకటి ఉన్నాయి. ఈ సందర్భంగా అర్జీదారులతో నేరుగా కమిషనర్ మాట్లాడారు. పిజిఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. కనుక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఎంహెచ్ఒ వినూత్న, ఇన్‌ఛార్జి ఎస్ఇ రీటా, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎమ్‌డి అబ్దుల్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం : కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని స్పెషల్ ఆఫీసర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. కోలమూరు పంచాయతీలో సోమవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, తొందరలోనే నూతన డ్రెయినేజీలను నిర్మిస్తామన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందితో మాట్లాడారు. వారి దైనందిన విధులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల సెక్రటరీలు ప్రతి రోజూ విధులను కచ్చితంగా డైరీలో పొందుపరచాలన్నారు. ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్యతో సచివాలయానికి వచ్చేవారు నిరుత్సాహంతో వెనుదిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. నిలిచిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌కు 213 అర్జీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 213 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అర్జీలు సమర్పించేందుకు ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. గ్రీవెన్స్‌లో అందిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తేమ శాతం పేరిట రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. యూరియా పుష్కలంగా అందుబాటులో ఉన్నందున రైతులకు సరైన సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో అందిన అర్జీలను వేగంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు హాస్టళ్లను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెసి వై.మేఘస్వరూప్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఎస్‌డిసి ఎస్.భాస్కర్‌రెడ్డి, పి.భాగ్యలక్ష్మి, సిపిఒ, జాయింట్ డైరెక్టర్ ఎల్. అప్పలకొండ, డిఎస్‌పి విద్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టియు జిల్లా అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - కడియం

ఎస్‌టియు జిల్లా అధ్యక్షునిగా ఎం.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. గైట్‌లో జరిగిన ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందరరేగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు .ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సిహెచ్‌సికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నూతన సూపరింటెండెంట్‌గా నియమితులైన డాక్టర్ సౌమ్య ఎంఎల్ఎశ్రీ వరుపుల సత్యప్రభను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు అన్ని విధాలుగా వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

ఘనంగా క్లాప్స్ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -పెద్దాపురం

స్థానిక బిఆర్.అంబేద్కర్ భవనంలో సోమవారం క్లాప్స్ వ్యవస్థాపకులు డాక్టర్ లంక పురుషోత్తమ దాస్, బిషప్ సిబిఐ సుకుమార్ పర్యవేక్షణలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెక్రటరీ జిమ్స్ శ్రీనివాస్ ప్రెసిడెంట్ జి.సత్యానందం కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ జిఆర్.ఇమ్మానియేల్ రాజ్ వర్తమానం అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ యార్లగడ్డ మన్నా, జోసెఫ్ బెన్నీ, డి.సామ్యూల్ సాగర్, డాక్టర్ సీరం ఐజాక్, డాక్టర్ పి.సురేంద్ర కుమార్, ఎం.విజయ్ కుమార్, నళిని, డాక్టర్ విజయలక్ష్మి, టి.బ్లెస్సింగ్, డి.వెంకట్‌పాల్, జ్ఞానానందం, డాక్టర్ డిఎస్‌పి.రావు, ఎన్.సుకుమార్, జె.జోసెఫ్ కుమార్, పి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-జగ్గంపేట

స్థానిక జగనన్న కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలను సోమవారం అధికారులు తొలగించారు. కాలనీకి సిపి ల్యాండ్‌గా ఉంచిన స్థలాన్ని కొందరు ఆక్రమించి లే అవుట్ వేసి అమ్మకాలు చేయడంతో పాటు బిల్డింగ్‌లు నిర్మిస్తున్నారు. కాలనీ వారికి కమ్యూనిటీ స్థలంగా ఉంచిన ప్లేస్‌లో అక్రమ కట్టడాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందడంతో వారు అక్కడకు చేరుకుని వాటిని తొలగించారు. ఆర్ఐ జి.మంగపతి నాయుడు, విఆర్ఒ బొరగ నాగసత్యనారాయణదొర ఉన్నారు.

పాడా పిజిఆర్ఎస్‌కు 43 అర్జీలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో పాడా పీడీ శ్రీనివాసరావు ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలపై 43 అర్జీలు అందాయని ఇందులో రెవెన్యూ 15, హౌసింగ్ 2, పిఆర్ 5, మున్సిపాలిటీ 11, ఇతరాలు 6 వచ్చాయని తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

పథకాల అడ్డగంతపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-పెద్దాపురం

ఆనూరులో దళితులకు సంక్షేమ పథకాలు అందకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డిఒ కె.శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ దళిత కాలనీలో పట్టాలు లేని 40 కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని, దళిత మహిళ ఇల్లు కట్టుకుంటే అడ్డుకుంటున్నారన్నారు. ఈ అంశాలపై విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, మడికి సత్యం, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి, కె.రామలింగేశ్వర రావు, సత్తిబాబు, పైడిమల్ల నాగరాజు, ఏషియా, గానుగుల సతీష్, అప్పారావు, చెక్కా సత్తిబాబు, పైడిమల్ల యమున, శిరీష, మంగశ్రీ, లోవ, గానుగుల సతీష్ పాల్గొన్నారు.

గోదావరి తీరం పర్యాటక సౌరభం

ప్రజాశక్తి-కడియం

గోదావరి తీరం సహజ సిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన పర్యాటక సౌరభమని ప్రముఖ రచయిత, సినీ నటులు ఎల్‌బి.శ్రీరామ్ అన్నారు. గోదావరి తీరంలో జరుగుతున్న ఒక టెలీ షూటింగ్ సోమవారం ధవళేశ్వరం రామపాదాల రేవు సమీపంలో గోదావరి ఒడ్డున జరిగింది. ఇందులో ఎల్‌బి.శ్రీరామ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ మేరకు ఈ నెల 15న కడియంలో జరిగే జంట కవుల రాష్ట్రస్థాయి సాహిత్య కార్యక్రమానికి కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, చెళ్లపిళ్ల కమిటీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు ఆయన్ని కలిసి ఆహ్వానించారు. గతంలో ఆయన చెళ్లపిళ్ల స్మారక పురస్కారం అందుకున్నారు. జంట కవులతో పాటు, ఆదికవి నన్నయ, శ్రీపాద, చిలకమర్తి కందుకూరి, బాపు రమణ లకు సాహితీ ప్రజ్వలనానికి గోదావరి తీరమే నాంది అన్నారు. గోదావరి నది తెలుగు సాహిత్యాన్ని ఎంతో ఉరకలు వేయించిందని ఎల్‌బి అన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా అబ్దుల్లా

ప్రజాశక్తి - నిడదవోలు

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులుగా మహ్మద్ అబ్దుల్లా నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో ప్రజలకు భద్రతా లేదన్నారు. దేశాన్ని కార్పొరేట్ సంస్థలు పాలిస్తున్నాయన్నారు. దేశంలో అందరూ బాగుండాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం కోసం కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన జిల్లా అధ్యక్షులు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డికి, నియోజకవర్గం కోఆర్డినేటర్ మేడవరపు భద్రందొర, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పట్నాయక్

ఆదిత్యలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం ప్రారంభమైనట్టు ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యా సంస్థలు, ఎన్ఐటి, ఐఐటి, విశ్వ విద్యాలయాల ప్రొఫెసర్లు, పారిశ్రామిక నిపుణులు పాల్గొంటారని తెలిపారు. డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 6 జి విభాగంలో పరిశోధనకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోందని అధ్యాపకులు, పరిశోధకులు దీన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్‌వివి.కృష్ణ మాట్లాడుతూ 6జి టెక్నాలజీ రాబోయే దశాబ్దంలో ప్రపంచాన్ని మార్చే కీలక పరిశోధన రంగం అనాన్రు. అధ్యాపకులు, పరిశోధకులు ఇందులో కొత్త అంశాలను అన్వేషించడానికి ఈ ప్రోగ్రామ్ ఎంతో పయోగపడుతుందని పేర్కొన్నారు. డీన్స్ డాక్టర్ వైఎస్.సుబ్బారావు, డాక్టర్ పిఎస్‌విఎస్.రవికుమార్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.అనిల్ కుమార్ మాట్లాడారు.

ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ఏ విధంగా రక్షించాలనే విషయాలపై ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సోమవారం విద్యార్థులకు అవగాహన కలిగించారు. రాజపూడి, మల్లిశాల, రామవరంలోని పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిపిఆర్ చేయడం, తుపాను వచ్చినప్పుడు ఎలా రక్షించాలి, నీటి ప్రమాదంలో పడినప్పుడు ఏ విధంగా సాయం అందించాలనే విషయాలను వారికి తెలిపారు. భూకంపం, అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఎలా రక్షణ పొందాలి అనే విషయాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పరువు తీశారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షల మంది ప్రయాణికులను ఇబ్బందులు పెట్టారని, ఇది కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ విమర్శించారు. ఈ ఘటనకు మంత్రి రామ్మోహన్‌నాయుడు బాధ్యత వహించాలన్నారు. సివిల్ ఏవియేషన్‌కి మంత్రిగా ఉన్న రామోహన్‌నాయుడుకి సరైన అవగాహనలేదని విమర్శించారు. మంత్రిగా పని చేస్తున్న ఆయన తెలుగు వారి ఆత్మ గౌరవాన్ని అంతర్జతీయ స్థాయిలో మంటగలిపారన్నారు. ఇండిగో సంస్థ, పైలెట్ల మధ్య ఏడాది కాలంగా వివాదం జరుగుతుందన్నారు. దీన్ని నేటి వరకు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇండిగో సంస్ద విషయంలో మంత్రి నారా లోకేష్ ఎలా మోనటరింగ్ చేస్తారని ప్రశ్నించారు..పైలెట్ల అవసరాలు, వారి పని దినాలను ఎందుకు పరిగణలోకి తీసుకోరని ప్రశ్నించారు. పైలెట్లకు మానసిక విశ్రాంతి చాలా అవసరమని, దీనిని దృష్టిలో ఉంచుకోకుండా ప్రకటనలు చేయడం సరైనది కాదన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు మల్లిశాల గ్రామానికి చెందిన మట్టే శ్రీనివాస్, మట్టే సింగర పద్మరాజు, మట్టే శ్రీహర్ష సాయం అందించగా ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పేదలకు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్, కొత్త కొండబాబు, టిడిపి నాయకులు జీను మణిబాబు, మద్దాల సత్యనారాయణ, సత్యనారాయణ, సర్వసిద్ధి లక్ష్మణరావు, ముండ్రు ఎర్రబాబు, రాయి సాయి, వేములకొండ జోగారావు, పిలా మహేష్, బద్ది సురేష్ పాల్గొన్నారు.